
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రీబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం 5 శ్రీ సత్యసాయి
ఆదివారం 19 జూలై 2026

# కులవివక్ష లేని సమాజం కోసం కదిలిరండి, కేవీపీస్ సంఘాల పిలుపు

కూడేరు, జూలై 18 (అనంత ప్రభ)

కూడేరు మండలంలోని ఎంపీడీఓ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం ముందు కుల వివక్షత లేని సమాజం కోసం సామాజిక శంఖారావ కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 18 నుండి సెప్టెంబర్ నెల 15 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని దళిత కాలనీలో అధ్యయన యాత్రలు సమస్యలపై ఆందోళన నిరసనలు వివక్షత, అంటరానితనము, స్మశాన స్థలాల సమస్యలపై ప్రత్యక్ష ప్రతిఘటన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కులవివక్ష, అంటరానితనం పోవాలని మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, నారాయణ గురు, పెరియార్ రామస్వామి, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య వంటి ఎందరో మహనీయులు నిరంతరం పోరాడారు. సామాజిక న్యాయసాధన కోసం ప్రజలను సమీకరించారు.స్వాతంత్ర్యం అనంతరం కొంతవరకు మార్పు వచ్చినా కులవివక్ష అనేక రూపాలలో నేటికీ కొనసాగుతున్నది. అనేక ప్రాంతాలలో పెత్తందారీతనం బుసలు కొడుతున్నది. దళిత మహిళలను చిన్నచూపు చూస్తున్నారు. అట్టడుగున ఉన్న దళితులు, ఉన్నత చదువులు చదివిన అధికారులు కూడా కులవివక్ష ఎదుర్కొంటున్నారు. విద్యాలయాల్లో కులతత్వాన్ని పాలకులు, యజమానులే పోషిస్తున్నారు. దళితులను రాజకీయ సాధనాలుగా పాలకపార్టీలు మార్చాయి. దళిత వాడలు ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో వున్నాయి. పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ సబ్ నిధులు కేటాయించి, విడుదల చేయడంలో, ఖర్చు చేయడంలో వివక్ష చూపుతున్నారు. "కులం పునాదుల మీద ఒక జాతిని గాని, ఒక నీతిని గాని నిర్మించలేరని ఎవరైనా ఆవిధంగా పూనుకుంటే అది విఫలంకాక తప్పదు" అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ మాటలకు విరుద్ధంగా కొందరు కుల అస్తిత్వాన్ని కాపాడేందుకు పూనుకుంటున్నారు. అంబేద్కర్కు అభివాదం చేస్తూ కొందరు



వ్యక్తులు, సంస్థలు పాలకపార్టీలకు అనుకూలంగా మారారు. ఆఖరికి మనువాదానికి మూలమైన బిజెపి పంచన చేరడం మరీ అన్యాయం. మన జిల్లాలో అగ్రకులాల వివక్షకు వ్యతిరేకంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్)వ్యవసాయ కార్మిక సంఘం అందరినీ కలుపుకొని శక్తి మేరకు కృషి చేస్తున్నది. అభ్యుదయ, దళిత సంఘాల భాగస్వామ్యంతో అనేక పోరాటాలు నిర్వహించింది. ఈ పోరాట ఫలితంగా రాష్ట్రంలో కులవివక్షత అధ్యయనం కోసం ప్రత్యేకంగా జస్టిస్ పున్నయ్య కమీషన్, ఏర్పాటు, దళితుడు చనిపోతే ఆరడుగుల స్మశాన స్థలము కూడా లేని గ్రామాలు అనేకంగా ఉన్నాయి

జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మత, ప్రాంత, లింగ సమస్యలతో పాటు స్మశానాల సమస్యలు, కాలనీలలో మౌలిక సమస్యలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి దళితులకు ఏ విధంగా అందుతున్నాయో పరిశీలించడానికి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల కార్యకర్తలు అధ్యయన యాత్రలు చేస్తున్నాయి. ఇందులో వచ్చిన సమస్యలపై ప్రజలందరిని కలుపుకొని, పరిష్కారం అయ్యేవరకు పోరాడాలని నిర్ణయించాయి.

దళితుల స్మశాన సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన జీవో 1235 అమలు చెయ్యాలి. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చెయ్యాలి. కోనేరు రంగారావు కమీషన్ సిఫారసులు అమలు చేసి భూమి లేని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు భూమి ఇవ్వాలి. కులాంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలి. మతం పేరుతో వేధింపులు ఆపాలి. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తూ పెత్తందారుల కొమ్ము కాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దళిత పేటల్లో మూసివేసిన ప్రాథమిక పాఠశాలలు పునరుద్ధరించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల స్కాలర్షిప్లు పెంచాలి. పిల్లల ఆరోగ్య బాధ్యత తీసుకోవాలి. పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు విడుదల చెయ్యాలి. దళిత మహిళలను కించపరుస్తూ మాట్లాడే అహంకార భాషను అరికట్టాలి. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చెయ్యాలి. ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చెయ్యాలి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ పునరుద్ధరించాలి. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చెయ్యాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బ్రాహ్మయ్య మండల అధ్యక్ష, కార్యదర్శి రాధాకృష్ణ, మల్లికార్జున, కరీమ్ సాబ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న కేవీపీస్ నాయకులు అజయ్ రాము రైతు సంఘం మండల కార్యదర్శి వీరప్ప మేకల పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఫేస్-2 హంద్రీనీవా కాలువ వెంట కదులుదాం..! మాజీ ఎమ్మెల్యే

- ఆదివారం ఉదయం 10:00 గంటలకు హంద్రీనీవా కాలువ పరిశీలన యాత్ర
- హంద్రీనీవా లైనింగ్ పనుల నాణ్యతను పరిశీలిద్దాం
- రైతులు, వైసిపి పార్టీ శ్రేణులు చోళసముద్రం హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకోండి

కూడేరు, జూలై 18 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం ఇంచార్జ్ వై విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కూడేరు మండల పరిధిలోని పి. నారాయణపురం, చోళ సముద్రం మధ్యన ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో హంద్రీనీవా వెడల్పు, లైనింగ్ పనుల పేరుతో చేపట్టినటువంటి హంద్రీనీవా కాలువ ప్యాకేజీ-2 పనుల నాణ్యత పరిశీలన యాత్ర 19-7-2026 ఆదివారం రోజున కొనసాగుతుందని ఈ హంద్రీ నీవా రెండవ దశ కాలువ పరిశీలన యాత్రను జయప్రదం చేయాలని ఉరవకొండ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరముల కాలంలో హంద్రీ నీవా మొదటి దశ వెడల్పు పనులు రెండవ దశ లైనింగ్ పనుల పేరుతో సుమారు 3850 కోట్లు వెచ్చించి ఖర్చు చేసినట్లు అధికారికంగా లెక్కలు చెబుతున్నాయి. ఈ పనుల వల్ల ఇటు ప్రజలకు అటు రైతులకు ఏ మేరకు ప్రయోజనం జరిగింది? ఈ పనులలో నాణ్యత లోపాలు ఏమైనా ఉన్నాయా? తదితర విషయాలను ప్రత్యేక్షంగా చూసి తెలుసుకొని కాంక్రీట్ పనుల పనుల లోపాలు ఏమైనా ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాయలసీమ



ప్రాజెక్టుల టాస్క్ ఫోర్స్ రాష్ట్ర నాయకులు సాంకేతిక నిపుణులు అన్ని నియోజకవర్గాల ఇన్చార్జులు,జిల్లా పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటున్నారు ఈ కార్యక్రమంలో హంద్రీ నీవా రెండవ దశ కింద గల స్థానిక ప్రజలు రైతుల సమక్షంలో జరుగుతున్న కారణంగా సంబంధిత ప్రజలు, రైతులు, వైయస్సార్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అలాగే ఫ్రంట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు మీ విలువైన సమయాన్ని కేటాయించి ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు కవర్ చేయవలసిందిగా మనవి

## ధర్మవరం పర్యటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 18 (అనంత ప్రభ)

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారు జూలై 20, 21 మరియు 22 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో విస్తృత పర్యటన నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా ఆధ్యాత్మిక, రాజకీయ, క్రీడా ప్రోత్సాహక మరియు ఆరోగ్య సంబంధిత పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు పేర్కొంది. జూలై 20 (సోమవారం) మధ్యాహ్నం 3:00 గంటలకు ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ నుండి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొంటారు. భక్తులతో కలిసి రథయాత్రలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందనున్నారు. ఈ మహోత్సవం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించబడనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. అనంతరం సాయంత్రం 5:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది.

జూలై 21 (మంగళవారం) ఉదయం 10:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య బీజేపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొంటారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై నాయకులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది. అనంతరం మధ్యాహ్నం 3:00 గంటలకు కరాటేలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్లో స్థానం సంపాదించిన ధర్మవరం కరాటే క్రీడాకారులకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొంటారు. ఈ సందర్భంగా



క్రీడాకారులను అభినందించి, యువత క్రీడల్లో మరింత రాణించేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

జూలై 22 (బుధవారం) ఉదయం 10:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని బీఎస్సార్ స్కూల్లో నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఐ స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. చిన్నారుల్లో కంటి సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించనున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ మూడు రోజుల పర్యటనలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సేవ, పార్టీ బలోపేతం, క్రీడా ప్రోత్సాహం మరియు ఆరోగ్య సేవల విస్తరణకు సంబంధించిన కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొని, ప్రజల సంక్షేమం మరియు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది

## రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కు భూమి కేటాయింపు

రాప్తాడు, జూలై 18 (అనంత ప్రభ)

రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు భూమి కేటాయింపు అనుమతులు రావడంపై మార్కెట్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీతకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడుకు గత కొన్నేళ్లుగా మార్కెట్ యార్డు కమిటీ ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఎక్కడా యార్డు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సునీత గతంలోనే స్పష్టమైన హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడుతామని.. ఇందుకు స్థలం కూడా కేటాయించేలా చూస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం శ్రీ పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానానికి చెందిన భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించాలని దేవాదాయశాఖకు పలు సార్లు విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత దేవాదాయశాఖ అమోదముద్ర వేసింది. సర్వే నెం. 476-3లోని భూమిలో 15 ఎకరాలను రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 11సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులు, మార్కెట్ కమిటీ అధికారులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్




యార్డు ఉండాలని ఎప్పటి నుంచి ప్రయత్నాలు చేస్తున్నామని.. ఇన్ని రోజులకు ఈ కల సాకారం అవుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారికి అన్నివిధాలుగా ఉపయోగపడే విధంగా మార్కెట్ యార్డు ఉంటుందన్నారు. ఈ భూమి జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉండటంతో రైతులు మరియు వ్యాపారుల సంక్షేమం కోసం గొర్రెలు, మేకల సంత నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు ఈ విషయంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. మరోవైపు మార్కెట్ యార్డ్ ఛైర్మన్, అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీత చొరవ వలనే ఇది సాధ్యమైందన్నారు. లీజు నిబంధనల ప్రకారం 15ఎకరాల భూమిని 11సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి సంవత్సరానికి యాభై వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు అద్దెపై 30 శాతం పెంపు ఉంటుందని.. మిగిలిన భూమిని దేవస్థానం భవిష్యత్ అవసరాల కోసం కేటాయించారని వివరించారు.

## జగన్ 2.0 సూపర్ యాప్: పోస్టర్లను ఆవిష్కణ

శింగనమల, జూలై 18 (అనంత ప్రభ)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు

సింగనమల నియోజకవర్గం సమన్వయకర్త మరియు మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ సూచనల మేరకు : జగన్ 2.0 సూపర్ యాప్: పోస్టర్లను

సింగనమల మండల కేంద్రంలోని స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ సాకే శైలజనాథ్ మరియు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి యాప్ ఉన్న పోస్టర్లను ఆవిష్కరించారు..

జగన్ 2.0 సూపర్ యాప్ లో పార్టీ ప్రతి కార్యక్రమం వివరాలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటాయి, రానున్న రోజుల్లో ఎవరైనా కార్యకర్తలు ఇబ్బంది పడితే ఈ యాప్ ద్వారా తోడుగా నిలిచి డెవలప్ చేస్తాం, ఇప్పటికే ఉన్న డిజిటల్ డైరీ కూడా ఈ యాప్ తో అనుసంధానమై ఉంటుంది..



ఈ కార్యక్రమంలో మండల నాయకులు బొమ్మన శ్రీరాంరెడ్డి, వీరాంజనేయులు, గోకుల్ రెడ్డి, ప్రతాపరెడ్డి,బండి లలిత కళ్యాణి, బాబు నాయక్,భాస్కర్, దిద్దుకుంట భాస్కర్ రెడ్డి, అబ్దుల్, బెస్త గోపాల్, చెన్నారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎన్వి నారాయణ, బండి శీన, శివమ్మ, వెంకట్రాముడు, నూరు మహమ్మద్, జల్లి గోపి యాదవ్, మంత్రిగారి వీరాంజనేయులు, ఆదినారాయణ, కిరణ్ నాయక్, శ్రీనివాసులు నాయక్, శీన, తిరుపతయ్య, రాజు, వెంకటప్ప, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

AP 4PG 19- 7- 2026 SUNDAY qxp_Layout 1 19-07-2026 07:42 AM Page 2



## వైకుంఠ సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. తిప్పేస్వామి



మడకశిర, జూలై 18 (అనంత ప్రభ)
మడకశిర మండలం నీలకంఠాపురం పంచాయతీ బచ్చలయ్యపాలెంకు చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బీఎన్. నరసింహమూర్తి గారు ఇటీవల పరమపదించారు. ఆయన వైకుంఠ సమారాధన కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఆ సమయంలో అందుబాటులో లేకపోవడంతో, డాక్టర్ ఎం. తిప్పేస్వామి గారు ఈరోజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి, స్వర్గీయుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, "బీఎన్. నరసింహమూర్తి గారు మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరం. ఆయన సేవలు చిరస్మరణీయమైనవి" అని కొనియాడారు.

## జగన్ 2.0 యాప్‌ను ఆవిష్కరించిన సాయి ప్రసాద్ రెడ్డి ప్రజా సమస్యలు యాప్ ద్వారా నేరుగా తెలియజేయొచ్చు




ఆదోని, జూలై 18 (అనంత ప్రభ)
ఆదోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగన్ 2.0 యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అక్రమాలను జగన్ 2.0 యాప్ ద్వారా నేరుగా పార్టీ దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిశీలించి తగిన చర్యలు తీసుకునే విధంగా రూపొందించారని పేర్కొన్నారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఈ యాప్ ఉపయోగకరమైన వేదికగా నిలుస్తుందని, ప్రతి కార్యకర్త దీనిని వినియోగించి ప్రజా సమస్యలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




ఆదోని, జూలై 18 (అనంత ప్రభ)
ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామంలో మూడో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టీజీఎల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించి పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత గ్రామ నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశంలో గ్రామాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కొండాపురం నర్సిరెడ్డి, కే.శ్రీనివాసులు, కే.వీరేష్, టీడీపీ నాయకులు బసవరాజ్, మౌలా, టీజీఎల్ స్కూల్ విద్యార్థులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## శరవేగంగా జరుగుతున్న పాపంపల్లి బీటీ రోడ్డు పనులు



ఆత్మకూరు, జూలై 18 (అనంత ప్రభ)
రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామపంచాయతీ పరిధిలోని పాపంపల్లి గ్రామం నందు గ్రామము నుంచి మెయిన్ రోడ్డు పోవడానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు దశాబ్దాల కాలం నుంచి తీవ్ర ఇబ్బందుల ను ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల స-ునీతమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రజల యొక్క దశాబ్దాల కలను నె-రవేరుస్తూ 50 లక్షల రూపాయలతో బీటీ రోడ్డును మంజూరు చేయించి నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నందుకు గ్రామ ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేయడం జరిగింది. మరియు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని కొనియాడుతూ కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈరోజు పూర్తి కావస్తున్న పనులను మండల కన్వీనర్ బోయ గంతి శ్రీనివాసులు, పాపంపల్లి శ్రీనివాసులరెడ్డి, వెంకట్రామిరెడ్డి,గంతి చిన్నవెంకటేశులు, నాగభూషణం, జి. నరసింహులు, ధనుంజయరెడ్డి, నాగేశ్వర్రెడ్డి, బాకు రమేష్, గంతి ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణస్వామి, తలారి వేణు, బెస్త జయప్ప, చిదంబర చౌదరి, వెంకటేష్ చౌదరి, అక్కులప్ప, గుజ్జుల వెంకటేష్, తదితరులు రోడ్డు పనులను పరిశీలించడం జరిగింది.

## పంపనూరు ఆలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



ఆత్మకూరు, జూలై 18 (అనంత ప్రభ)
ఆత్మకూరు మండలం పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆలయ ఈవో బాబు పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో డ్రై-నేజీలో పేరుకుపోయిన మురుగు మట్టిని తొలగించి నీరు ముందుకు సాగిపోయే విధంగా కాలువలు శుభ్రం చేశ-ారు. శ్రావణమాసం వస్తున్నందున భక్తుల రద్దీ పెరుగుతుందని పేరుకుపోయిన మురికిని తొలగించి ఆలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకుంటేనే భక్తులకు సౌకర్యంగా ఉండగలుగుతుందని ఆలయ పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించడానికి వచ్చే భక్తులు కారణంగా సిబ్బంది పరిశు భ్రతకు ఎంత కృషిచేసినా యధావిధిగా చెత్త పెరిగిపోతోందని నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎవరు పరిశుభ్రత మీద దృష్టి సారించికపోవడం తీరని సమస్యగా తయారైంది. ఆదివారం మంగళవారం రోజులలో దీపాలు వెలిగించడానికి వచ్చే భక్తులకు ఎన్ని సూచనలు చేసినా వారిలో మార్పు రావడంలేదని పలువురు భక్తులే పెదవిరుస్తున్నారు. దీంతో పరిశుభ్రత పెద్ద సమస్యగా పరిణమించింది అని నిర్వహకులు వాపోతున్నారు. శనివారం ఆలయ సిబ్బంది మొత్తం పరిశుభ్రతకే సమ-యం కేటాయించాల్సి వచ్చిందని ఈవో బాబు పాలకమండలి చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, క్లర్క్ ఆన్ పూజారి ఆనంద్ నరసింహయ్య, బాలరాజు, వెంకటేష్, రాజగోపాల్, భజంత్రీలు శివప్ప, వెంకట్ నారాయణ, సూర్యనారాయణ సిబ్బంది ఆలయ పరిశు భ్రతపై దృష్టి సారించి ప్రత్యేక చొరవ చూపించారు

## అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాదు.. పచ్చదనం, పరిశుభ్రత కూడా ముఖ్యం



రాప్తాడు, జూలై 18 (అనంత ప్రభ)
అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు పచ్చదనం పరిశుభ్రతను కూడా ప్రాధాన్యతగా తీసుకొని తమ ప్రభుత్వం పని చేస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రామగిరి మండలం కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఇంకుడు గుంత తవ్వడానికి భూమి పూజ చేశ-ారు. తడి చెత్త - పొడి చెత్తను వేరు చేయు విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత పాఠశాల మొత్తం ఆమె పరిశీలించారు. వంటగది లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. వంటగది నిర్మాణానికి ఎంత మేర ఖర్చవుతుందని ఆరా తీశారు. వెంటనే ఆమె స్పందించి మండల పరిషత్ నుంచి మూడు లక్షల రూపాయలతో వంటగది నిర్మించాలని ఎంపీడీఓని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పై పా-ఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి తడి, పొడి చెత్త వేరు చేయు విధానం గురించి తెలిస్తే వారి ఇళ్లలో కూడా చెబుతారన్నారు. పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం విషయంలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కాపాడే విధంగా విద్యార్థులకు బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

## ధర్మవరంలో మౌలిక వసతుల కల్పనకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి



ధర్మవరం, జూలై 18 (అనంత ప్రభ)
రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు, సూచనల మేరకు ధర్మవరం పట్టణంలోని 32వ వార్డు శివరాం నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న కాలువ నిర్మాణ పనులను ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, శనివారం మునిసిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, పనుల వేగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కాలువ నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నదా అనే విషయాన్ని పరిశీలిస్తూ, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నాణ్యతను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువ నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు సకాలంలో బయటకు వెళ్లే విధంగా కాలువ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ... ధర్మవరం పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపా-యాల అభివృద్ధికి మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, మార్గదర్శకత్వంలో వేగంగా చర్యలు చేపడుతున్నామని, ధర్మవరం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హరీష్ బాబు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతతో పాటు పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి పని ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా పూర్తి చేయడమే లక్ష్యమని తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని హరీష్ బాబు పేర్కొన్నారు

## లోకదాలత్ లో 47 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం




అనంత, జూలై 18 (అనంత ప్రభ)
అనంతపురం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఇ.భీమారావు
శనివారం రోజున ఉదయం 10:30 నుండి 5 గంటల వరకు చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోకదాలత్ నిర్వహించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలలోని ప్రతి కోర్టు ఆవరణము నందు చెక్ బౌన్స్ కేసులపై ప్రత్యేక లోకదాలత్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలలోని 47 చెక్ బౌన్స్ కేసులు కు గాను పరిష్కా-రమయిన మొత్తం రూపాయలు 36,62,000 పరిష్కరించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్ ఈ.భీమారావు తెలిపారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో కేసులు పరిష్కారం కోసం మూడు బెంచులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొదటి బెంచ్ నందు పెర్మమేంట్ లోక్ అదాలత్ చైర్మన్ శైలజ దేవి, మొదటి స్పెషల్ మేజిస్ట్రేట్ శివశంకర్ మరియు రెండవ స్పెషల్ మేజిస్ట్రేట్ సుబ్బారావు ఆధ్వర్యంలో కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు.

## శిథిలం అయిన కల్వర్టు మరమ్మతులు చేయండి



శింగనమల, జులై 18 (అనంత ప్రభ)
శింగనమల మండలం, నాయనవారిపల్లి గ్రామం నుంచి ఆనందరావుపేట గ్రామం కు వెళ్ళు రోడ్డు మార్గంలో హెచ్ఎల్సీ కాలువపై ఉన్న కల్వర్టు శిథిలం కావడంతో గుంత పడి కూలిపోయిన బ్రిడ్జి ఈ పరిస్థితి నాయనవారిపల్లి, ఆనందరావు పేట గ్రామానికి మధ్య దారిలో నెలకొంది. దీంతో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనదారులు రాకపోకలను కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులుతో గత ఆరు నెలల నుంచి గ్రామ ప్రజలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు అయినప్పటికీ ప్రభుత్వ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదు అని గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ కల్వర్టు గుండా పంటను రవాణా చేస్తున్నామని దీంతో అనుకోని ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని రైతులు వాపోతున్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని ఆనందరావుపేట, నాయనవారిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

## 22న డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయండి: కమతం వెంకటేష్



ఆదోని, జూలై 18 (అనంత ప్రభ)
దివ్యాంగుల హక్కులు, రాయితీలు, రిజర్వేషన్లు, సామాజిక సాధికారత కోసం పనిచేస్తున్న దివ్యాంగుల సాధికారత ఫోరం (డిఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవ సభను ఈ నెల 22న ఆదోనిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ తెలిపారు. శనివారం ఆదోనిలోని రెడ్డి జనసంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు డిఈఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ నెల 22వ తేదీ బుధవారం ఆదోనిలోని రెడ్డి జనసంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగే ఆవిర్భావ దినోత్సవ సభకు ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల నాయకులు, దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని దివ్యాంగ సోదర, సోదరీమణులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర డిఈఎఫ్ అధ్యక్షులు బి.సి. నాగరాజు, జిల్లా నాయకులు ఇస్మాయిల్, ఎర్రిస్వామి, సోమప్ప, రంజాన్, రామదాసు, వెంకటేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీమతి ఉషాశ్రీ చరణ్ కి జన్మదిన శుభాకాంక్షలు




ఆదోని, జూలై 18 (అనంత ప్రభ)
ఆదోని పట్టణంలోని నారాయణ పాఠశాల ఎదుట పీడీఎస్‌వో ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి ప్యానెల్ బోర్డులు, యాప్‌లు, టెక్నో కోర్సులు, ఒలింపియాడ్ తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సరైన ధ్రువపత్రాలు లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్నారని, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్ తదితర వస్తువులను తప్పనిసరిగా కొనుగోలు చేయిస్తూ అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించకుండా తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస-్తున్నారని అన్నారు. విద్యా అర్హతలు లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా చేశారు. స్థానిక విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యాశాఖ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి శివ, దస్తగిరి, రంగన్న, రాము, సాయి, రంగస్వామి, వీరేష్, అంజి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.







# దోసకాయ వలన కలిగే అద్భుత ప్రయోజనాలు

దోసకాయలు ఆరోగ్యానికి అవసరమయ్యే అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాల యొక్క గొప్ప మూలం. వీటిలో ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె మరియు పొటాషియం అధికంగా ఉంటాయి, ఇవన్నీ శరీరంలో ముఖ్యమైన పాత్రలను పోషిస్తాయి.

విటమిన్ సి అనేది యాంటీఆక్సిడెంట్, ఇది హానికరమైన ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. విటమిన్ కె ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనది మరియు రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. పొటాషియం ఒక ఖనిజం, ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

దోసకాయలు విటమిన్ ఎ, విటమిన్ బి6 మరియు మెగ్నీషియం వంటి ఇతర పోషకాలను కలిగి ఉంటాయి, అలాగే ఫైబర్, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**దోసకాయలోని ఆరోగ్య ప్రయోజనాలు**

**మెరుగైన జీర్ణక్రియ:** దోసకాయలలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. దోసకాయలో నీరు ఎక్కువగా ఉంటుంది, ఇవి మలం మృదువుగా మరియు సులభంగా బయటకు వెళ్లడానికి సహాయపడతాయి.

**హైడ్రేషన్:** దోసకాయలు 95% కంటే ఎక్కువ నీటిని కలిగి ఉంటాయి, ఇవి హైడ్రేట్‌గా ఉండటానికి మంచి మార్గం. దోసకాయలు తినడం వలన మీరు రిఫ్రెష్ భావనను మరియు శక్తిని పొందవచ్చు, ముఖ్యంగా వేడి వాతావరణంలో లేదా వ్యాయామం తర్వాత తీసుకోవడం చాలా మంచిది.



**బరువు తగ్గడం:** దోసకాయలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. నీరు మరియు ఫైబర్ అధికంగా ఉండటం వలన, ఇది ఎక్కువ కేలరీలు తీసుకోకుండా మీరు పూర్తి మరియు సంతృప్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడం లేదా బరువు పెరగటానికి ఆహారంలో భాగంగా చేసుకోవడం ఉత్తమం.

**మెరుగైన చర్మ ఆరోగ్యం:** దోసకాయలు చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ప్రముఖమైన పదార్థం, ఎందుకంటే వాటిలో విటమిన్ సి మరియు కెఫిక్ యాసిడ్ ఉన్నాయి, ఇవి చర్మపు చికాకు మరియు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దోసకాయలను తినడం వల్ల హైడ్రేషన్ మరియు ముఖ్యమైన పోషకాలను అందించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**ఉబ్బరం తగ్గించడం :** దోసకాయలు శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి, ఇవి కళ్ల చుట్టూ ఉబ్బిన ప్రాంతాన్ని తగ్గిస్తాయి. అందుకే మీరు స్పాలలో లేదా సినిమాల్లో కళ్లపై దోసకాయ ముక్కలను ఉపయోగించడం తరచుగా చూస్తారు.

**దోసకాయతో అందం మెరుగు పరుచుకోవడం ఎలా?**

దోసకాయలు మీ ఆరోగ్యానికి మాత్రమే కాదు, మీ చర్మం మరియు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దోసకాయల యొక్క కొన్ని సౌందర్య ప్రయోజనాలు ఇక్కడ తెల్సుకుందాం:

**చర్మ సంరక్షణ:**

దోసకాయలు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉండే సమ్మేళనాలను కలిగి ఉంటాయి మరియు చికాకు లేదా ఎర్రబడిన చర్మానికి ఉపశమనం కలిగి ఇస్తాయి. దోసకాయ ముక్కలు లేదా రసాన్ని చర్మానికి అప్లై చేయడం వల్ల ఎరుపు మరియు చికాకు తగ్గుతుంది.

# గోరింటాకు ఎర్రగా పండటానికి అరుదైన చిట్కాలు



మహిళలు గోరింటాకు ఎర్రగా పండాలని కోరుకుంటారు గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడు వస్తాడని చాలామంది నమ్మకం అయితే గోరింటాకు ఎర్రగా అందంగా పండాలి అంటే ఏం చేయాలి అనే ప్రశ్న మన మనస్సులో రావచ్చు. ఈ వ్యాసంలో మీ కోసం గోరింటాకు- మెహందీ ఎలా ఎర్రగా పండేలా చేయాలి అనే దానికి ప్రతిస్పందనగా చక్కని అరుదైన చిట్కాలు

గోరింటాకు పెట్టుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత చేతికి ఎలాంటి తడి లేకుండా చూసుకుని తర్వాత మీకు ఇష్టమైన డిజైన్‌ను మీ చేతుల్లో అలంకరించుకోండి. ఏడు నుంచి ఎనిమిది గంటలు అలాగే ఉంచండి. మీరు గోరింటాకు 12 గంటలు అలాగే ఉంచవచ్చు. అదే సమయంలో గోరింటాకు (మెహందీ) తీసినపుడు చాలామంది నీటితో సబ్బుతో కడుగుతారు అలా కాకుండా నీళ్లు లేదా ఎలాంటి సబ్బు ఉపయోగించకుండా గోరింటాకు ఎండు పోయిన తర్వాత గోరింటాకును అర చేతులను కలిపి రుద్దడం ద్వారా గోరింటాకును తొలగించండి. గోరింటాకు పూర్తిగా తొలగించే వరకు ఇలా చేయండి. ఇలా చేయడం ద్వారా మీరు కొన్ని గంటల ప్రభావాన్ని చూస్తారు మరియు మీరు మెహందీ ఎర్రగా అందంగా ఎక్కువ కాలం ఉంటుంది.

**మెహందీ గోరింటాకు నిమ్మ-చక్కెర రసం**

నిమ్మకాయ-చక్కెర గోరింటాకు రంగును ఎర్రగా చేయడానికి సులభమైన మార్గం. నీటిలో కొద్దిగా చక్కెర ఉడకబెట్టి ఈ మిశ్రమం చల్లారిన తర్వాత ఒక గిన్నెలో తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. గోరింటాకు ఎండిన తర్వాత ఈ మిశ్రమాన్ని రాయండి. చక్కెర గోరింటాకు చర్మంపై ఎక్కువసేపు ఉండటానికి సహాయపడుతుంది, నిమ్మరసం మెహందీ రంగును మరింత లోతుగా చేస్తుంది. మెహందీ ఆరడం ప్రారంభించినప్పుడు మీరు నిమ్మ-చక్కెర రసాన్ని రాయాలి తద్వారా గోరింటాకు -మెహందీ మీ చేతుల్లో ఎక్కువసేపు ఉంటుంది మరియు గోరింటాకు రంగుని మీ చేతుల మీదకి ఇంకెలా చేసి దాని అందాన్ని కూడా పెంచుతుంది.

# అధిక రక్తపోటును అదుపులో ఉంచాలా?

## పాలలో ఇది కలుపుకొని తాగండి

ప్రపంచంలో అధిక శాతం మంది హైపర్ టెన్షన్ లేదా హైబీపీతో బాధపడుతున్నట్టు అంచనా. చాలామందిలో హై బీపీ తీవ్ర స్థాయికి చేరుకునే వరకు పట్టించుకోరు. ఆ తర్వాత వైద్యుడు వద్దకు పరుగులు తీస్తారు. తలనొప్పి, జ్వరం, ఒళ్ళు నొప్పులు, దగ్గు వంటివి బీపీ పెరిగితే కనిపించే లక్షణాలు. ఒకప్పుడు వయసు పెరిగాక మాత్రమే హైబీపీ వచ్చేది. ఇప్పుడు 18 ఏళ్ల వయసు నుంచి కూడా హైపర్ టెన్షన్ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరికి హైబీపీ ఉంటున్నట్టు వైద్యుల అంచనా.

ఇది ఎందుకు వస్తుందో కచ్చితంగా చెప్పలేము. వంశపారంపర్యంగా కూడా హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తినడం తగ్గించేసింది యువత. ప్రాసెస్డ్ ఫుడ్, పిజ్జాలు, బర్గర్లు, నిల్వచేసిన మాంసం, కూల్ డ్రింకులు, ఫ్రిజ్ లో ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలు తినడం వల్ల కూడా హైబీపీ వస్తున్నట్లు అంచనా. ఉప్పు అధికంగా వాడడం వల్ల హై బీపీ త్వరగా వచ్చేస్తుంది. టెన్షన్ కూడా హైబీపీ వచ్చే అవకాశాన్ని పెంచుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ లో ఎక్కువగా తిరిగేవారు ఈ టెన్షన్ బారిన పడుతున్నారు.

ఆయుర్వేదం ప్రకారం అధిక రక్తపోటు వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలలో అసమతుల్యత వల్ల వస్తుంది. శరీరంలో టాక్సిన్స్ చేరడం, చెడు జీవనశైలి, వ్యాయామం లేకుండా నిశ్చలంగా ఉండడం, జీవక్రియ సరిగా జరగకపోవడం వంటివి కూడా అధిక రక్తపోటుకు కారణాలు. అయితే ఆయుర్వేదంలో అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచే ఒక అద్భుత ఔషధం ఉంది.

ఇదొక్కటి చాలు

హైబీపీ బారిన పడినవారు దాన్ని అదుపులో ఉంచాలనుకుంటే ఆయుర్వేదం చిట్కాను సూచిస్తోంది. ప్రతిరోజు ఉదయం పాలలో రెండు మూడు గ్రాముల అర్జున బెరడు పొడిని కలుపుకొని తాగాలి. ఇది రక్తపోటును తగ్గించడమే కాదు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన ఔషధం.

దీన్ని ఎలా చేయాలంటే

ఈ పానీయాన్ని ఇంట్లో సులభంగా చేసుకోవచ్చు. ముందుగానే అర్జున చెట్టు బెరడు పొడిని కొని ఇంట్లో పెట్టుకోవాలి. ఒక కప్పు పాలను మరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ పొడిని వేయాలి. ఇలా రోజుకు



రెండుసార్లు ఈ పాలను తాగడం వల్ల మార్పు మీకే కనిపిస్తుంది. రక్త పోటు అదుపులో ఉంటుంది. అలాగే తాజా ఆకుకూరలు, కూరగాయలు తింటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీని వల్ల రక్తపోటు పెరగదు. అర్జున చెట్టు ఎక్కడైనా కనిపిస్తే దాని బెరడు ఒలిచి ఎండబెట్టుకుని పొడి చేసి దాచుకోండి.

# తలనొప్పిగా ఉందా? ఈ చిట్కా పాటిస్తే పెయిన్ కిల్లర్‌తో పనే ఉ



తలనొప్పి అత్యంత సాధారణమైన సమస్య. లోకంలో చాలా మంది మైగ్రేన్ లేదంటే టెన్షన్ వల్ల కలిగే తలనొప్పితో బాధ పడుతున్నారని నార్వేజియన్ నిపుణులు ఒక అధ్యయనం ద్వారా కనుగొన్నారు. పారాసిటమాల్, ఐబుప్రోఫిన్ లేదా ఆస్పిరిన్ వంటి సాధారణ పెయిన్ కిల్లర్స్ తలనొప్పి తగ్గించేందుకు విరివిగా వాడుతున్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వైద్య నిపుణులు పెయిన్ కిల్లర్ వాడకుండా తలనొప్పి తగ్గించుకునే మార్గాలను వివరించారు.

మెడ కండరాలు బిగుసుకు పోవడం వల్ల కూడా తలనొప్పి వస్తుంది. ఇలాంటి తలనొప్పి తగ్గించుకోవడానికి మెడ కండరాలకు మంచి మసాజ్ ఇస్తే సరిపోతుందట. చాలా సార్లు ఈ చిన్న చిట్కాతో తలనొప్పి తగ్గిపోతుందట. కొన్ని నిమిషాలు కేటాయిస్తే చాలు మెడ కండరాలు బలోపేతం అవుతాయి. మెడ కండరాలు బలంగా ఉంటే తలనొప్పి రాకుండా నివారించవచ్చు. తల మీద చేతిని ఉంచి తలను పక్కకి పది సెకండ్ల పాటు నొక్కి ఉంచడం వల్ల మెడ కండరాలు బలం సంతరించుకుంటాయి.

నీళ్లు ఎక్కువ తాగాలి

డీహైడ్రేషన్ కూడా తలనొప్పికి కారణం అవుతుందని గుర్తుంచుకోవాలి. రోజులో తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి. కనీసం రోజుకు ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగాలి. ఇలా తగినన్ని నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం మాత్రమే కాదు, మెదడు కణజాలాలు కూడా ఆరోగ్యంగా, కుంచించుకు పోకుండా ఉంటాయి. మెదడు కణజాలం కుంచించుకు పోతే పుర్రెనుంచి దూరంగా జరగడం వల్ల నాడులు లాగినట్టయి తలనొప్పి వస్తుంది. అలా జరగకూడదంటే తప్పనిసరిగా తగినన్ని నీళ్లు తాగాలి.

సరిపడా నిద్ర తప్పనిసరి

తిండి, నిద్ర, శ్రమ, జీవిత నాణ్యతను నిర్ణయిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఏది తగ్గినా ఆరోగ్యానికి మంచిది కాదు. నిద్ర సరిపడినంత లేకపోతే మొదట కనిపించే లక్షణం తలనొప్పే. 18 నుంచి 80 సంవత్సరాల మధ్య వయసున్న అందరూ 6 నుంచి 11 గంటల పాటు నిద్ర పోవాల్సిందేనని నిపుణులు సలహా ఇస్తున్నారు. కనీసం 7 నుంచి 9 గంటల పాటు నిద్రపోవాల్సి ఉంటుందట. నిద్ర శరీరానికి విశ్రాంతిని ఇచ్చి మెదడు తిరిగి రెజువనేట్ కావడానికి దోహదం చేస్తుంది. అందువల్ల తలనొప్పి రాకుండా చేస్తుంది.

# పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలు తినాల్సిన, తినకూడని ఆహార పదార్థాల జాబితా ఇదిగో



పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలకు ఏం తినాలి? అన్న విషయంలో చాలా సందేహాలు ఉంటాయి. పిసిఓఎస్ లేదా పాలీ సిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కంటే ఎక్కువ మంది మహిళలను వేధిస్తున్న హార్మోన్ల రుగ్మత. పిసిఓఎస్ ఉన్న మహిళల్లో ఆండ్రోజన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉత్పత్తి అవుతుంది. ఇది ఒక మగ హార్మోను. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. అంతేకాదు టైప్2 డయాబెటిస్, రక్తపోటు, డిప్రెషన్ వంటివి వీరిలో త్వరగా వస్తాయి. జుట్టు అధికంగా పెరగడం, మొటిమలు రావడం, బరువు త్వరగా పెరగడం, పీరియడ్స్ సరిగా రాకపోవడం వంటివి కూడా వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. గర్భం ధరించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే పిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి.

పాలకు బదులు

ఈ సమస్యతో బాధపడుతున్న మహిళలు పాల వినియోగం వల్ల మరింతగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. 2013లో చేసిన అధ్యయనం ప్రకారం తక్కువ పాల ఉత్పత్తులను తీసుకునే వారితో పోలిస్తే, ఎక్కువ మొత్తంలో పాల ఉత్పత్తులను వినియోగించే పిసిఓఎస్ స్త్రీలు ఇన్సులిన్ నిరోధకతను అధికంగా కలిగి ఉంటారు. అయితే వ్యక్తికి వ్యక్తికి ఈ ఫలితం భిన్నంగానే ఉన్నట్టు కూడా అధ్యయనం చెప్పింది. పాల ఉత్పత్తులు మీకు సరిపడకపోతే ప్రత్యామ్నాయంగా ఓట్స్ పాలు, బాదం పాలు, సోయా పాలను ఎంచుకోవడం మంచిది. పనీర్‌కు బదులుగా సోయాతో చేసిన టోఫూను తినవచ్చు.

ఉడికించినవే

వేయించిన ఆహారాలు, కాల్చిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. క్యాలరీలు కూడా ఎక్కువే. వీటిని తినడం వల్ల పిసిఓఎస్ సమస్య పెరుగుతుంది. ఇన్సులిన్ నిరోధక శక్తి మరింతగా దిగజారుతుంది. కాబట్టిపిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు వేయించిన, కాల్చిన ఆహారాలకు దూరంగా ఉండాలి. ఉడికించిన ఆహారాన్ని ఎప్పుడు ఎంచుకోవాలి.

# టాలీవుడ్ డైరెక్టర్‌తో డేటింగ్ రూమర్స్? ఆ హీరోతో రిలేషన్‌లో ఉన్నానంటూ హీరోయిన్ ట్విస్ట్!





చిత్ర పరిశ్రమలో బ్యాచిలర్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్న నటీనటులంతా ఒక్కొక్కరిగా మ్యారేజ్ లైఫ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నా. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఈ ట్రెండ్ కొనసాగుతోంది. ఎప్పటి నుంచో ప్రేమాయణం సాగిస్తున్న అమ్మాయిలంతా తమ పార్టనర్స్, కాబోయే భర్తలను పరిచయం చేస్తున్నారు. తాజాగా ఈ లిస్ట్‌లోకి తమిళ నటి బ్రిగిదా సాగా ఎంట్రీ ఇచ్చారు. ఈ వివరాల్లోకి వెళితే..

తమిళనాడుకు చెందిన బ్రిగిదా సాగా.. తొలుత ఆహా కళ్యాణం అనే తమిళ సీరియల్‌లో పవి టీచర్‌గా బాగా ఫేమస్ అయ్యారు. ఈ పాపులారిటీతో సినీరంగం నుంచి ఆమెకు అవకాశాలు వచ్చాయి. 2019లో అయోగ్య అనే సినిమాతో వెండితెర మీదకి అడుగుపెట్టారు బ్రిగిదా. ఆ తర్వాత వర్మా, మాస్టర్ సినిమాలలో నటించారు. వెళన్, ఇరవిన్ నిజాల్, గరుగన్, కొజిపణ్ణై చెల్లాదురై, మార్గాన్, ఇడ్లీ కడాయ్, హాట్ స్పాట్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సింధూరం, పెదకాపు పార్ట్ 1 సినిమాలతో తెలుగు వారిని కూడా ఆకట్టుకున్నారు.

అందరు హీరోయిన్ల మాదిరిగానే బ్రిగిదాపైనా పలు రూమర్స్ వచ్చాయి. ప్రధానంగా తెలుగు డైరెక్టర్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ శ్రీకాంత్ అడ్డాలతో బ్రిగిదా రిలేషన్‌లో ఉన్నారంటూ అప్పట్లో వార్తలు వైరల్ అయ్యాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలలో వీరి వ్యవహారం చర్చనీయాంశమైంది. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో తెరకెక్కిన పెదకాపు సినిమాలో బ్రిగిదా సాగా నటించారు. ఈ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు గాసిప్స్ వైరల్ అయ్యాయి. అయితే ఇద్దరిలో ఎవరూ దీనిపై స్పందించలేదు.

కానీ తమిళ దర్శకుడు, నటుడు పార్థిబన్ అప్పట్లోనే బ్రిగిదా- శ్రీకాంత్ అడ్డాల వ్యవహారంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ మీడియాపై మండిపడ్డారు. ఇదంతా ఒట్టిదేనని, వీరిద్దరి మధ్య ఎలాంటి బంధం లేదని తేల్చేశారు. శ్రీకాంత్ సతీమణి రాగసుధను తానే కోలీవుడ్‌కి పరిచయం చేశానని, ఇలాంటి వాటిని ఆమె అస్సలు పట్టించుకోదేదని పార్థిబన్ తేల్చేశారు. దాంతో శ్రీకాంత్ అడ్డాల- బ్రిగిదాల రిలేషన్ వార్తలకు చెక్ పడింది. ఇద్దరూ ఎవరి సినిమాలతో వారు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో బ్రిగిదా సాగా సైలెంట్‌గా షాకిచ్చారు. తాను ఒకరితో రిలేషన్‌లో ఉంటున్నానని, ప్రియుడితో ఉన్న ఫోటోను షేర్ చేశారు.

తమిళ నటుడు, యువ హీరో అనంత్ రామ్‌తో తాను రిలేషన్‌లో ఉన్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు బ్రిగిదా. నా చిన్నప్పుడు అందమైన ప్రేమకథలు కేవలం సినిమాలలో ఉంటాయేమో అనుకునే దానిని, కానీ జీవితం నా కోసం అద్భుతమైన, అందమైన కథ రాసింది. నా ఫిలిం జర్నీలో నా లాంటి అభిరుచులు, కలలు ఉన్న అనంత్ నాకు తారసపడ్డాడు. స్నేహంతో మొదలైన మా బంధం ఇప్పుడు ప్రేమ వరకు వచ్చింది. అంతేకాదు.. మేమిద్దరం ఐ లవ్ యూ అని చెప్పుకుని వదిలేసే రకం కాదంటూ బ్రిగిదా రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా.. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు బ్రిగిదా- అనంత్ రామ్ జోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పాలంటూ ఆకాంక్షిస్తున్నారు. అనంత్ రామ్ కూడా చిన్నా చితకా సినిమాలలో ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే యత్నాల్లో ఉన్నాడు.




# హైదరాబాద్‌లో సల్మాన్ ఖాన్ సందడి.. నయనతార ఎంట్రీతో పెరిగిన అంచనాలు!




బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'హంజ63' షూటింగ్ ఈ వారమే హైదరాబాద్‌లో మొదలు కానుంది. ఈ భారీ షెడ్యూల్ కోసం దర్శకుడు వంశీ పైడిపల్లి ఇప్పటికే నగరంలోని కీలక లొకేషన్లను ఫైనలైజ్ చేశారు. సల్మాన్ రాక కోసం ఇక్కడి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్, టాలీవుడ్ కలయికలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తమ నగరంలోనే ఇంత పెద్ద సినిమా షూటింగ్ జరుగుతుండటంతో స్థానిక సినీ ప్రియులు ఖుషీ అవుతున్నారు. షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా ప్లాన్ చేసిన చిత్ర యూనిట్, ఈ వారాంతంలో పనులన్నీ పూర్తి చేసింది. ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతార తన బిజీ కాల్ షీట్ నుంచి ప్రత్యేకంగా డేట్స్ కేటాయించారు. ఆమె రాకతో ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ వాల్యూ పెరిగింది. షూటింగ్ స్పాట్స్ దగ్గర ఫ్యాన్స్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులు కూడా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. హీరోయిన్ డేట్స్ విషయంలో ఉన్న సస్పెన్స్‌కు ఈ అప్‌డేట్‌తో తెరపడింది.

నగరంలోని ఐకానిక్ లొకేషన్లతో పాటు ప్రైవేట్ స్టూడియోల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించనున్నారు. దాదాపు మూడు వారాల పాటు ఈ షెడ్యూల్ కొనసాగనుంది. సల్మాన్ ఖాన్ లుక్ లీక్ అవ్వకుండా చిత్ర యూనిట్ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. సినిమా ఫస్ట్ హాఫ్‌కు ఈ షెడ్యూల్ వెన్నెముక లాంటిదని తెలుస్తోంది. ఇప్పటికే స్టంట్ కోఆర్డినేటర్లు, నటీనటులు హైదరాబాద్ చేరుకుని రిహార్సల్స్ మొదలుపెట్టేశారు. షూటింగ్ కోసం సిద్ధమైన నయనతార సల్మాన్ గ్లోబల్ స్టార్‌డమ్, వంశీ పైడిపల్లి మేకింగ్ స్టైల్ కలిసి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. సౌత్ ఇండియన్ నేటివిటీ మిస్ అవ్వకుండా మేకర్స్ ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా డిజైన్ చేస్తున్నారు. సల్మాన్-నయనతార జోడీ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ కాంబినేషన్ సౌత్ మార్కెట్‌లో సినిమాకు భారీ ఓపెనింగ్స్ తెచ్చిపెడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నయనతార ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం దక్షిణాది రాష్ట్రాల్లో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. లోకల్ టెక్నీషియన్లతో సందడి సినిమాకు పక్కా రీజినల్ ఫ్లేవర్ తీసుకురావడానికి చాలా మంది తెలుగు టెక్నీషియన్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నారు. స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.

# ఆల్ఫా బాక్సాఫీస్ రేస్ ప్రారంభం.. అడ్వాన్స్ బుకింగ్ రెస్పాన్స్ ఎలా ఉందంటే?




బాలీవుడ్ యువ హీరోయిన్లు ఆలియా భట్, శర్వరీ వాఘ్ తమ కొత్త సినిమా 'ఆల్ఫా'తో బాక్సాఫీస్ వద్ద యాక్షన్ మోత మోగించడానికి సిద్ధమయ్యారు. జూన్ 26, 27 తేదీల్లో విడుదలైన కొత్త ప్రోమోలు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. జులై 3న విడుదల కానున్న ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న ఈ చిత్రం ఒక సరికొత్త మలుపుగా నిలవనుంది.

ఈ సినిమాలో ఆలియా, శర్వరీ అత్యంత కఠినమైన పోరాట దృశ్యాల్లో నటించారు. ఒక సూపర్ స్పై పాత్ర కోసం ఆలియా భట్ ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుంది. శర్వరీతో కలిసి ఆమె చేసే హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రధాన యాక్షన్ సినిమాలను ఇష్టపడే ఆడియన్స్‌ను ఈ చిత్రం భారీగా ఆకట్టుకోనుంది.

**ఆల్ఫా అడ్వాన్స్ బుకింగ్ ట్రెండ్స్.. ఇండియా వైడ్ రిలీజ్ డీటెయిల్స్**

జులై 3న థియేటర్లలో ఈ సినిమా సందడి మొదలుకానుంది. ఇప్పటికే బుక్‌మైషో, పీవీఆర్ వంటి యాప్స్‌లో అడ్వాన్స్ బుకింగ్ అలర్ట్స్ కనిపిస్తున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్ల కోసం ఫ్యాన్స్ అప్పుడే పోటీ పడుతున్నారు. మెట్రో నగరాలతో పాటు టైర్-2 సిటీల్లోనూ ఈ సినిమాపై భారీ హైప్ కనిపిస్తోంది.

**ఆలియా భట్ 'ఆల్ఫా' తెలుగు వెర్షన్.. ఏపీ, తెలంగాణ స్క్రీన్ అప్‌డేట్స్**

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హిందీతో పాటు తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా భారీ ఎత్తున విడుదల కానుంది. హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఐమాక్స్ , పీఎక్స్‌ఎల్ వంటి ప్రీమియం స్క్రీన్లలో ఈ సినిమాను వీక్షించవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రేక్షకులకు వరల్డ్ క్లాస్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ప్లాన్ చేస్తున్నారు.

**ఆల్ఫా యాక్షన్ డిజైన్.. స్పై యూనివర్స్‌లో సరికొత్త ప్రయోగం**

పఠాన్, టైగర్ సిరీస్ వంటి బ్లాక్ బస్టర్ సినిమాల బాటలోనే 'ఆల్ఫా' కూడా రూపొందింది. అయితే, మహిళా స్పైల కోణంలో కథను నడిపించడం ఈ సినిమా ప్రత్యేకత. భారీ బడ్జెట్, విదేశీ లొకేషన్లు, ఖరీదైన స్టంట్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ ఏడాది గ్లోబల్ లెవల్లో స్పై జానర్ సినిమాలకు ఈ చిత్రం కొత్త ఊపునిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఆల్ఫా ఇన్‌స్టాగ్రామ్ ప్రోమోలు.. అప్‌డేట్స్ మిస్ అవ్వకండి**

మంచి సీట్లు మిస్ అవ్వకుండా ఉండాలంటే డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో టికెట్ రిమైండర్లు సెట్ చేసుకోవడం మంచిది. లేటెస్ట్ అప్‌డేట్స్, సాంగ్ రిలీజ్ వివరాలు, బిహైండ్ ది సీన్స్ వీడియోల కోసం ఆలియా భట్ అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ పేజీని ఫాలో అవ్వండి. సినిమా రిలీజ్ కంటే ముందే ఎక్స్‌క్లూజివ్ విషయాలను తెలుసుకోవడానికి ఇది ఫ్యాన్స్‌కు మంచి అవకాశం.

# ది బాయ్ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

మర్డర్ కేసులో జైలు శిక్ష అనుభవించిన మేరి లుకా (ఫర్జానా పాలథింగల్) జైలులోనే బిడ్డకు జన్మనిస్తుంది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత కొడుకు వాసుదేవ్ (ఆదిశేషన్ కేఆర్)తో కలిసి బయటకు వస్తుంది. తమ ఐడెంటిటీ గురించి తెలియకుండా జాగ్రత్త పడుతూ పలు ప్రదేశాల్లో తలదాచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఆ క్రమంలో ఓ వృద్దురాలి సంరక్షణగా చేరుతుంది. అయితే తన కుటుంబానికి దూరంగా బతుకుతున్న వృద్దురాలి కోరిక మేరకు చనిపోయిన తర్వాత ఆమె పార్థీవ దేహాన్ని తన ఇంటిలోనే పాతిపెడుతుంది. ఈ విషయం తెలుసుకొన్న కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మేరిని అరెస్ట్ చేస్తారు. ఆ సమయంలో వాసుదేవ్ స్కూల్ వెళ్లడంతో తల్లి నుంచి విడిపోతాడు

మేరీ లుకా ఏ పరిస్థితుల్లో హత్య కేసులో ఇరుక్కొన్నది? మారు పేర్లతో తల్లి కొడుకులు ఎందుకు రహస్య జీవితాన్ని కొనసాగించారు? తమ గతం గురించి కొడుకు ఎలాంటి కథలు చెప్పింది? తల్లికి కొడుకు ఎలా అండగా నిలుస్తాడు? తల్లితో విడిపోయిన తర్వాత వాసుదేవ్ పరిస్థితి ఏమిటి? వాసుదేవ్ ఎలా పెరిగాడు? తల్లిని వెతకడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తల్లి ఆచూకీ కోసం ఎవరెవర్నీ కలిశాడు? వాసుదేవ్ లైఫ్‌లో అబ్బాస్ (టొవినో థామస్) పాత్ర ఏమిటి? తల్లి, కొడుకు ఎలా కలిశారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా కథ.

తల్లి, కొడుకుల రహస్య ప్రయాణం, ఐడెంటిటీ తెలియకుండా జాగ్రత్త పడటమనే అంశాలతో కథ చాలా స్లోగా సాగుతుంది. ఈ సినిమా సన్నివేశాల్లో డీటెయిలిటీ ఎక్కువ కావడంతో సినిమా కొంత డాక్యుమెంటరీ టచ్ అనిపిస్తుంది. కాకపోతే 70 ఏళ్ల వృద్దురాలి క్యారెక్టర్ కథలోకి వచ్చిన తర్వాత కొంత ఫన్‌తో సాగడం ఫీల్‌గుడ్‌గా అనిపిస్తుంది. తల్లి, కొడుకులు విడిపోయిన తర్వాత స్టోరీలో ఎమోషన్స్, సెంటిమెంట్ అంశాలు ఎలివేట్ అయ్యేలా చిదంబరం సినిమాను తెరకెక్కించారు. టొవినో థామస్ అతిథి పాత్రలో కనిపించినప్పటికీ.. సినిమా కథకు అంతగా ఉపయోగపడేలా కనిపించదు. కాకపోతే భావోద్వేగంతో సాగే సినిమాగా ఓ హానెస్ట్ అటెంప్ట్ కనిపిస్తుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న సినిమాగా హృదయాలను టచ్ చేస్తుంది. ఈ సినిమాను కొంత ఓపికగా చూడాల్సిన పరిస్థితి ఉంటుంది.

నటీనటుల పెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. ఫర్జానా, ఆదిశేషన్ ఇద్దరు మాత్రమే సినిమాను నిలబెట్టారని చెప్పవచ్చు. వారు తమ పాత్రల్లో జీవించడంతో ప్రతీ సన్నివేశం బాగా పండింది. డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌ను ఫర్జానా చాలా సులభంగా, అలవోకగా పోషించారు. చిన్నవాడైనా పిల్లాడు తన వయసుకు మించిన పరిణతితో ఆకట్టుకొన్నారు. మిగితా పాత్రల్లో కనిపించిన వారు తమ క్యారెక్టర్ల డెప్త్ మేరకు ఫర్వాలేదనిపించారు. ఈ సినిమాకు ప్రధానంగా సినిమాటోగ్రఫి, మ్యూజిక్ పూర్తిస్థాయిలో సపోర్టుగా నిలిచాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోరు సన్నివేశాలను ఎమోషనల్‌గా మార్చాయి. ఆటవీ ప్రాంతం, గ్రామీణ ప్రాంతంలో సాగే సినిమా కావడంతో పల్లె, అడవి అందాలను చక్కగా కెమెరాలో బంధించారు. సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలను రూపొందించే కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ తొలి ప్రయత్నంగా కంటెంట్ ప్రధానమైన సినిమాతో రావడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే మంచి ఉన్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను అందించారు. చైల్డ్ డ్రామా, మదర్, సన్ రిలేషన్స్, సైకాలజీ సర్వైవల్ థ్రిల్లర్స్ చూడాలనుకొనే వారికి బాలన్: ది బాయ్ చక్కటి ఆప్షన్. కాకపోతే కొంత ఓపికగా చూస్తే మంచి అనుభూతి కలుగుతుంది.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com